లక్ష్యం వైపు ఆదాయం..

- ఈ ఏడాది ఇల్లెందు మార్కెట్ లక్ష్యం రూ.4.64 కోట్లు
- జనవరి వరకు రూ.3.91కోట్ల ఆదాయం
- మిగిలిన సమయంలో వసూళ్లకు అధికారుల కార్యాచరణ


వ్యాపారుల వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేస్తున్న గార్డులు

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ ఆదాయం లక్ష్యానికి చేరువలో ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం రూ.4.64 కోట్లు ఉండగా జనవరి నెలాఖరు నాటికి రూ.3.91 కోట్లు సాధించింది. ఇంకా ఈ నెల సీసీఐ, ధాన్యం కొనుగోళ్ల నుంచి రావాల్సిన బకాయిలు సుమారు రూ.55 లక్షల వరకు ఉండగా మరో రూ.60 లక్షలు సాధిస్తే ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యం పూర్తయినట్లే. ఇందుకోసం మార్కెట్ అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇల్లెందు మార్కెట్ యార్డులో సుమారు 50 మంది అనుమతి కలిగిన వ్యాపారులు ఉన్నారు. ఆరు వరకు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఇల్లెందు మార్కెట్ యార్డు 6 ఎకరాల స్థలంలో 8 గిడ్డంగులు 4,800 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగి ఉంది. మార్కెట్ యార్డు పరిధిలో ఇల్లెందు, గుండాల, గార్ల, బయ్యారం, సింగరేణి, కామేపల్లి, టేకులపల్లి మండలాల్లో 86 గ్రామాలు ఉన్నాయి. ఇల్లెందు మార్కెట్ యార్డు పరిధిలో గార్లలో ఉపమార్కెట్ ఉంది. గుండాల, టేకులపల్లి, బయ్యారం మండలాల్లో సైతం మార్కెట్ గోదాములను నిర్మించారు.

వ్యాపారుల చెంతకు గార్డులు..

ఇల్లెందు మార్కెట్ యార్డు పరిధిలోని పలు మండలాల్లో వ్యాపారులు సక్రమంగా, క్రమం తప్పకుండా క్రయవిక్రయాలు నమోదు చేయటం లేదని గ్రహించిన మార్కెట్ అధికారులు ప్రతీ రోజు వ్యాపారుల చెంతకు వెళ్లి క్రయవిక్రయాల నమోదును పరిశీలిస్తున్నారు. రిజిస్టర్లలో నమోదు చేయటం కోసం వ్యాపారుల చెంతకు గార్డులు వెళ్తున్నారు. గడిచిన వారం రోజులుగా ఈ పరిణామం చోటుచేసుకోవటంతో వ్యాపారులకు పాలుపోని పరిస్థితి నెలకొంది. చాలా మంది వ్యాపారులు తమ వ్యాపార క్రయవిక్రయాలు రిజిస్టర్లలో నమోదు చేయకుండా రైతుల పేరుతో పత్రాలు సృష్టించి చాటుమాటుగా తరలిస్తున్నారు. ఈ తరుణంలో గార్డులను వ్యాపారుల చెంతకు పంపించి వారి క్రయ విక్రయాలు పరిశీలించి రిజిస్టర్లలో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వ్యాపారులు ఏమీ చేయలేక అనివార్యంగా తమ క్రయవిక్రయాలను రిజిస్టర్లలో నమోదు చేస్తున్నారు.

లక్ష్య సాధన దిశగా..



ఇల్లెందు మార్కెట్ పరిధిలో ఆర్థిక సంవత్సరం ఆదాయం లక్ష్య సాధన దిశగా పయనిస్తోంది. మరో రూ.60 లక్షలు ఆదాయం మరో రెండు నెలల్లో సాధించాల్సి ఉంది. ఇప్పటికే క్రయవిక్రయాల మీద రిజిస్టర్ల నమోదు మీద దృష్టిసారించాం. వ్యాపారం చేసే ప్రతీ ఒక్కరు లైసెన్సు తప్పని సరిగా కలిగి ఉండాలి. లైసెన్సుల మీద దృష్టిసారించాం. క్రయవిక్రయాల మీద కూడా దృష్టిసారించి వ్యాపారుల చెంతకు గార్డులను పంపించి రిజిస్టర్లు పరిశీలించటం, నమోదు చేయించటం సాగుతోంది

–ఇ.నరేశ్, మార్కెట్ కార్యదర్శి, ఇల్లెందు

క్రీడాకారులను ప్రోత్సహించాలి


విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: క్రీడాకారులను ప్రోత్సహిస్తే వారు మరింతగా రాణిస్తారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మ అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఖమ్మం నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, భద్రాద్రి యువసేన వలంటరీ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా విద్యార్థులకు పలు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానం కైవసం చేసుకున్న కె.నరేందర్, మహిళ కబడ్డీ పోటీలో ప్రథమస్థానం గెలుపొందిన స్వందన, షటిల్ పోటీలో బి.వినోద్‌కుమార్, డి.లక్ష్మీ దుర్గా, అథ్లెటిక్స్ 200 మీటర్ల పరుగుపందెంలో గెలుపొందిన సీహెచ్ ప్రణయ్, బి.రేణుకకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బి.వెంకట్, గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డి, జె.అబ్రహం, బి.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాగులో వేస్తున్న చెత్త

- నీటి పారుదలకు తీవ్ర అంతరాయం
- వర్షాలొస్తే ఇళ్లలోకి పొంగుతున్న వైనం


టేకులపల్లి ఇనుపమోరి వాగులో పేరుకుపోయిన వ్యర్థాలు

టేకులపల్లి: పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో నానా తంటాలు పడుతున్నారు. టేకులపల్లి, గోలియా తండా పంచాయతీలకు హద్దుగా ఉన్న ఇనుపమోరి వాగు మురుగునీరు, చెత్తాచెదారానికి నిలయంగా మారింది. వారాంతపు సంత, రెండు పంచాయతీల పరిధిలోని ఇళ్లల్లోని చెత్త, కొబ్బరిబొండాలు , కోళ్ల దుకాణాలు, చేపల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలన్నింటినీ తీసుకొచ్చి వాగులో వేస్తున్నారు. పశువుల సంతలోనూ విపరీతంగా చెత్తా చెదారం వేస్తుండటంతో అదంతా వాగులోనే కలుస్తోంది. గాలి, వర్షం వచ్చినప్పుడల్లా దుర్గంధాన్ని సమీప నివాసులు భరించలేక పోతున్నారు. గ్రామాల్లో చెత్త కుండీలు లేకపోవడంతో వాగునే చెత్త కుండీగా మార్చారు. పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరిస్తున్నప్పటికీ టేకులపల్లి, గోలియాతండా పంచాయతీలకు చెందిన ప్రజలు, వ్యాపారులు చెత్తంతా వాగులో వేస్తుండటంతో పేరుకుపోతోంది. నీటి పారుదలకు అంతరాయం కలుగుతోంది. భారీ వర్షాలు వచ్చినప్పుడు వాగులో చెత్తా చెదారం నీటిని అడ్డగించడంతో వరద నీరు ఇళ్లల్లోకి పారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇనుపమోరిలో చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇల్లెందులో పర్యటించిన జీఎం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో మార్కెటింగ్ జీఎం డీఆర్ ప్రసాద్ పర్యటించారు. గురువారం ఇల్లెందులోని సీహెచ్‌పీ, కేటీసీని సందర్శించి మాట్లాడారు. రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గును రవాణా చేయాలన్నారు. అనంతరం జీఎం వి.కృష్ణయ్య ఆధ్వర్యంలో తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఓస్ఓటూ జీఎం రామస్వామి, గిరిధర్‌రావు, నరసింహరాజు, జీవీ మోహన్‌రావు, రవికుమార్, మధుబాబు, నాగరాజు నాయక్, దీలీప్‌కుమార్, సుధాకర్, రామదాసు, శివ వీరకుమార్ తదితరులు ఉన్నారు.


మార్కెటింగ్ జీఎం ప్రసాద్‌ను సత్కరిస్తున్న జీఎం వీసం కృష్ణయ్య

ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న కందుల దినేశ్

టేకులపల్లి: ఎయిడ్స్ నియంత్రణ అందరి బాధ్యత అని మండల వైద్యాధికారి కందుల దినేశ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ ప్రాంతీయ హాస్పిటల్‌కు చెందిన సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని సులానగర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. పలు సుఖ వ్యాధులు ఎలా వసాయో? అవగాహన కల్పించారు. సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఎయిడ్స్ హెల్ప్‌లైన్ 1097 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రమణారెడ్డి, సత్యకుమార్, శ్రీనివాస్, యాకస్వామి, పవిత్ర, నిర్మల, ప్రియాంక, ప్రమీల, కృష్ణవేణి, రచన, స్వర్ణ, చైతన్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు అన్నారు. కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పి.వెంకటేశ్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగం అనేక సమస్యలతో సతమతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు రఘు, వెంకటేశ్, చరణ్, సతీశ్, శశికుమార్, దీపక్, నిఖిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, జస్వంత్, అరుణ్, వేణుగోపాల్, కళ్యాణ్ పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న గౌని నాగేశ్వరరావు

బీసీ గురుకులంలో అదనపు కలెక్టర్ తనిఖీ


విద్యాలయంలో తనిఖీ చేస్తున్న విద్యాచందన

పాల్వంచ: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల విద్యాలయాన్ని గురువారం సాయంత్రం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం తరగతి గదులను, స్టడీ అవర్‌లో విద్యార్థులు చదువుతున్న తీరు పరిశీలించారు. విద్యార్థులు ఉపయోగించే టాయిలెట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తాగునీటిని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

టేకులపల్లి/ఇల్లెందురూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పోలారం గ్రామవాసి, ఇఫ్టూ జిల్లా నాయకుడు జటంగి వెంకన్న కుటుంబానికి తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.7,550 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో డి.ప్రసాద్, మూడు బిచ్చు, కణతాల అన్నాజీ, మాడే వెంకటేశ్వర్లు, బానోత్ భీముడు, బాదావత్ రమేశ్, తాటి ప్రవీణ్, వాంకుడు సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారదర్శకంగా సేవలు అందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్ వేణుమాధవ్

కొత్తగూడెంఅర్బన్: రిజిస్ట్రేషన్ సేవల్లో డాక్యుమెంటరీ, సంబంధిత నకలు ప్రతి వెరిఫికేషన్ వంటి కొత్త విధానాల ప్రవేశంతో మరింత పారదర్శకంగా సేవలు అందించేందుకు ముందడుగు పడిందని కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ వి.వేణుమాధవ్ తెలిపారు. గురువారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజిస్ట్రేషన్ సేవల్లో పారదర్శకతను పెంచే దిశగా, ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందని, ప్రజలకు వేగవంతమైన, న్యాయ సమ్మతమైన సేవలను అందించేందుకు అనేక సంస్కరణలను అమలు చేస్తోందని తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన వెరిఫికేషన్ విధానాల ద్వారా, పత్రాల నిజమైన ధ్రువీకరణ తక్షణమే జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ మార్పులతో నకిలీ రిజిస్ట్రేషన్లు ఉండవని, అలాగే పత్రాలు సరైనవేనా? అనే విషయంపై ముందుగా నిర్ధారణ అవుతుందని, ప్రజలు భవిష్యత్‌లో ఎలాంటి చట్టపరమైన సమస్యలు ఎదుర్కొనకుండా ఉంటారని వివరించారు. కొత్తగూడెం సబ్–రిజిస్ట్రార్ కార్యాలయం నూతన సేవలను అమలు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 2న కాసాని సంస్మరణ సభ

సుజాతనగర్: వచ్చేనెల 2న అమరజీవి కాసాని ఐలయ్య సంస్మరణ సభ నిర్వహించనున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. సుజాతనగర్ సీపీఎం మండల కమిటీ సమావేశం నర్రా శివరామకృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. సభకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రంతో పాటు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర, జిల్లా నాయకత్వం పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ, మండల కార్యదర్శి వీర్ల రమేశ్, కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్, బచ్చలికూర శ్రీనివాస్, చిప్పిడి వెంకటేశ్వర్లు, గూని నాగచందర్, కొండె కృష్ణ. నల్లగొప్ప పుల్లయ్య, వీర్ల మల్లేష్, వీర్ల సత్యం, ఉడుగుల శ్రీకాంత్, భూక్యా శంకర్, బాణోత్ కుమారి, బాణోత్ జ్యోదిరామ్, మద్దెబోయిన గొవర్ధన్, బాలు వెంకటేశ్వర్లు, బాణోత్ వీరు పాల్గొన్నారు.

నియామకాలపై స్పష్టత ఇవ్వాలి

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కింద స్థాపించినట్లు చెబుతున్న నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్, రీక్రియేషన్ మిషన్ (ఎన్ఆర్‌డీఆర్ఎం) సంస్థ పరిధిలో ఉమ్మడి రాష్ట్రాల్లో నియామకాలు చేపడుతున్నట్లు వచ్చిన ఉద్యోగ ప్రకటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టతనివ్వాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో కోరారు. రెండు రోజుల నుంచి పలు దినపత్రికల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు విభాగాల్లో 13,762 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలు రావడంతో నిరుద్యోగులు ఆన్‌లైన్ చేసుకోవటానికి సిద్ధమవగా.. మరోపక్క ఈ ఉద్యోగ నియామక నోటిఫికేషన్ ఫేక్ అని పలు వేదికల్లో ప్రకటనలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నియామకాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ చేపట్టి స్పష్టత ఇవ్వాలని కోరారు.

పాఠశాలలో ఫిజియోథెరపి క్యాంప్


దివ్యాంగుడికి ఫిజియోథెరపి చేస్తున్న శ్రీదేవి

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం దివ్యాంగుల పిల్లల కోసం ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించారు. అంగవైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు ఫిజియోథెరపిస్టు శ్రీదేవి ఫిజియోథెరపి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టకతో పోలియో బారినపడిన పిల్లలకు ఫిజియోథెరపి క్రమం తప్పకుండా చేయడం వల్ల అంగవైకల్యాన్ని అధిగమించవచ్చునన్నారు. ఫిజియోథెరపి ఎన్నో లాభాలున్నాయని ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బానోత్ జుంకీలాల్, జూలూరుపాడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, ఐఈఆర్‌టీలు సాంబశివరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మూఢత్వానికి వ్యతిరేకంగా పోరాటం


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ బాధ్యులు

కొత్తగూడెంఅర్బన్: మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా గౌరవ అధ్యక్షులు సుబ్బారావు తెలిపారు. గురువారం లక్ష్మీదేవిపల్లిలోని కృష్ణవేణి కళాశాలలో డార్విన్ సిద్ధాంత పరిణామక్రమం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల్లో ప్రశ్నించే స్వభావాన్ని, శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించేందుకు జేవీవీ ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. డ్వారిన్ జీవ పరిణామ క్రమంలో జీవులు ఉద్భవించి అనేక రకాలుగా మార్పు చెంది వేల కోట్ల సంవత్సరాల తర్వాత ఈ మానవ రూపం పొందారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కస్తూరి, రాష్ట్ర బాధ్యురాలు, ఎం.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ కోసం సహకరించండి


వినతిపత్రం ఇస్తున్న అఖిల పక్ష ప్రతినిధులు

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియాలో నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ వర్తింపజేసేలా సహకరించాలని కోరుతూ గురువారం అఖిలపక్ష కమిటీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. జేకే ఓసీ విస్తరణలో భాగంగా నిర్వాసితులైన 21పిట్ ఏరియావాసులకు నిర్వాసిత పునరావాస చట్టం–2013కు అనుగుణంగా పరిహారం చెల్లించాల్సి ఉండగా సింగరేణి లీజు స్థలం అయినందున నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వబోమని అధికారులు చెబుతున్నారని వాపోయారు. నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ తోపాటు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సింగరేణి నిధులతో మౌలిక వసతులు కల్పించేలా బాధితుల పక్షాన ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని, అసెంబ్లీలో తమ సమస్యను ప్రస్తావించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ ప్రతినిధులు కె.సారయ్య, పూనెం సురేందర్, అబ్దుల్ నబీ, హరికృష్ణ, క్లింట్ రోచ్, సదరం మహేశ్, వడ్ల శ్రీను, లాలు, దేవరకొండ శంకర్, మంచాల వెంకటేశ్వర్లు, నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా అందించాలి..


మాట్లాడుతున్న ముత్యాల విశ్వనాథం

పాల్వంచరూరల్: ఎలాంటి షరుతులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కమిటీ నాయకులు ముత్యాల విశ్వనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కారెగట్టు, సారెకల్లు గ్రామాల్లో గురువారం సీపీఐ శాఖ మహాసభలు నిర్వహించగా ఆయిన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నాలుగు గ్యారంటీల అమలు కోసం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రకటించిన అర్హత అనేక మంది పేదలకు లేదని తెలిపారు. అధికారులు చిత్తశుద్ధితో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పశెట్టి రాహుల్, నిమ్మల రాంబాబు, కొంగర అప్పారావు, చెన్నయ్య, ఉండ్రాతి రవి, గురుమూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శిస్తే సహించరు..


మాట్లాడుతున్న డానియేల్, సైదులు

ఇల్లెందు: నకిలీ విత్తనాలు, అమ్మి ప్రజలను మోసం చేసిన వ్యక్తిని, తమ పార్టీ వ్యక్తిగా ప్రకటించుకుని, కాంగ్రెస్‌పై విమర్శలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఇల్లెందు పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దొడ్డా డానియేల్, పులి సైదులు తెలిపారు. రైతులకు న్యాయం చేయాల్సిన తరుణంలో బీఆర్ఎస్ నేతలు మోసం చేసిన వ్యక్తికి కొమ్ముకాస్తుండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రేగా కాంతారావు, బానోతు హరిప్రియ.. లక్కినేని సురేందర్‌రావు లాంటి వ్యక్తిని తమ నేతగా ప్రకటించుకుని కాంగ్రెస్‌ను విమర్శించటం తగదని, ఈ ఇద్దరూ కూడా కాంగ్రెస్ పెట్టిన భిక్షతోటే ఎమ్మెల్యేలుగా గెలిచిన విషయాన్ని గుర్తుంచుకోవాలని హితువు పలికారు. అలాంటి కాంగ్రెస్‌ను విమర్శిస్తే ప్రజలు సహించరని పేర్కొన్నారు. సమావేశంలో యదళ్లపల్లి అనసూర్య, సుదర్శన్ కోరీ, బోళ్ల సూర్యం, గాలిపల్లి స్వరూప, పడిదల నవీన్, జాఫర్, మెట్ల కృష్ణ, ఆరెం కిరణ్, పాయం స్వాతి, మడుగు సాంబమూర్తి, శంకర్, తాటి భిక్షం, తాటి రాంబాబు, బొల్లి రామారావు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు, నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ టేకులపల్లి మండల అధ్యక్షుడు భూక్య దేవానాయక్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో మొక్కజొన్న విత్తన కంపెనీతో కమిషన్‌కు ఒప్పందం కుదుర్చుకుని గిరిజన రైతులకు విత్తనాలు పంపిణీ చేసిన లక్కినేని సురేందర్‌పై రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఈ అంశంలో కాంగ్రెస్ పార్టీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. సమావేశంలో కోరం సురేందర్, రెడ్యానాయక్, ధర్మయ్యగౌడ్, బండ్ల రజిని, ఈది గణేశ్, బాణోతు శంకర్, పోశాలు, పూన్యా, శివ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పోరాట ఫలితమే..

ఇల్లెందు: సింగరేణిలో కారుణ్య నియమాకాల ఉద్యోగ పరిమితి 35 నుంచి 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవటం ఏఐటీయూసీ పోరాట ఫలితమేనని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కె.సారయ్య, ఇల్లెందు బ్రాంచ్ సెక్రెటరీ నజీర్ అహ్మద్ తెలిపారు. గురువారం ఇల్లెందులో వారు మాట్లాడారు. కార్మికుడు మరణించినా, మెడికల్ ఇన్వాలిడేషన్ అయినా కార్మికుడి వారసుడికి 35 ఏళ్లలోపు వయస్సు ఉంటే ఉద్యోగం వచ్చేదని, నేడు విడుదలైన సర్క్యులర్‌తో 40 ఏళ్ల డిపెండెంట్లకు కూడా ఉద్యోగం లభిస్తుందని తెలిపారు. 2018 మార్చి 9 నుంచి 2024 జూన్ 9 వరకు పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్లకు కొత్త సర్క్యులర్‌తో ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు.

అప్పుడే భానుడి ప్రతాపం

- ఫిబ్రవరిలోనే ఎండ ప్రభావం
- పెరుగుతున్న పగటిపూట ఉష్ణోగ్రతలు


విక్రయానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

చుంచుపల్లి: చలికాలం ఇంకా పూర్తిగా పోక ముందే జిల్లా వాసులకు అప్పుడే ఉష్ణతాపం మొదలైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఉదయం పది గంటల నుంచే భానుడి ప్రతాపం కనిపిస్తోంది. జిల్లాలో బుధ, గురువారాల్లో పగటి ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలు దాటాయి. ఇటీవల కొత్తగూడెం పట్టణంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు ఎక్కువగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో వారంలోగా ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరువయ్యే అవకాశాలున్నాయి. వేసవి రాకముందే పెరుగుతున్న ఎండలతో ప్రజలకు ముందుగానే వేడిగాలులు, ఉక్కపోత బాధలు మొదలవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఇక వచ్చే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణతాపం ఎలా ఉంటుందోనని భయాందోళన చెందుతున్నారు.

వెలుస్తున్న శీతల పానీయాల షాపులు

సంక్రాంతి పండుగ ముందు రోజు వరకూ జిల్లా ప్రజలను గజగజ వణికించిన చలి భోగి పండుగ రోజు నుంచి తగ్గుతూ వస్తోంది. జనవరి నెల మొదటి పది రోజులు జిల్లా ప్రజలపై చలి పంజా విసిరింది. దీంతో ప్రజలు చలి తీవ్రతకు వణికిపోయాయి. సాధారణంగా ఏటా సంక్రాంతికి సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతూ చలి తీవ్రతను పెంచుతాయి. ఇదే పరిస్థితి ఈ సారి కూడా కనిపించింది. ఇక సంక్రాంతి నుంచి చలి ఛాయలు అంతగా లేకపోగా మధ్యాహ్న ఉష్ణోగ్రతలు నానాటికీ పెరుగుతున్నాయి. దీంతో శీతలపానీయాలు, కొబ్బరిబొండాలు, పుచ్చకాయల దుకాణాలు వెలుస్తున్నాయి. అలాగే, వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఇప్పటికే కూలర్లు, ఏసీలను వినియోగించడం మొదలుపెట్టారు.